


సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసానికి తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ అభివాదం చేస్తున్న అధినేత కేసీఆర్. పక్కన హరీశ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి

# కేసీఆర్‌కు ఉగాది శుభాకాంక్షల వెల్లువ

**ఎర్రవల్లి నివాసానికి తరలివచ్చిన బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు • వేలాదిగా పోటెత్తిన పార్టీ కార్యకర్తలు • అభిమానానికి ధన్యవాదాలు: కేసీఆర్**

గజ్వేల్/మర్కూక్, ఏప్రిల్ 9: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని నివాసానికి మంగళవారం మధ్యాహ్నం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పోటెత్తడంతో పరిసరాలు జనసంద్రంగా మారాయి. చాలామంది రావడంతో ఒక్కొక్కరిని సిబ్బంది లోపలికి అనుమతించారు. వేలాదిగా వస్తూనే ఉండటంతో కేసీఆర్ స్వయంగా బయటకు వచ్చి కార్యకర్తలకు, నేతలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు జహంగీర్, మాదాసు శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు జుబేర్ తదితరులు ఉన్నారు.

**మీ అభిమానానికి ధన్యవాదాలు: కేసీఆర్**

క్రోధినామ సంవత్సర ఉగాది శుభకాంక్షలు తెలిపేందుకు వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా రావడంతో ఒక్కొక్కరిని కలవడానికి ఎక్కువ సమయం పట్టి ఆలస్యమవుతున్న విషయం తెలుసుకొన్న కేసీఆర్ స్వయంగా బయటకు వచ్చారు. అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. 'మీ అభిమానానికి ధన్యవాదాలు.. మనమందరం కలిసికట్టుగా పోరాడి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం. ఇక ముందు మన ప్రయాణం చాలా ఉన్నది' అని పేర్కొన్నారు. 'మీ అందరికీ ఉగాది శుభాకాంక్షలు.. శుభం కలగాలని భగవంతుడిని కోరుకుంటున్న.' అని తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా బాగుండాలని భగవంతుడిని ఆకాంక్షించినట్టు కేసీఆర్ పేర్కొన్నారు. జై తెలంగాణ నినాదాలతో కేసీఆర్ నివాసం మార్మోగింది. కార్యకర్తలకు పేరు పేరునా కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

## 13 నుంచి.. కార్యరంగంలోకి కేసీఆర్

మొదటిపేజీ తరువాయి...

హరీశ్‌రావు ఇప్పటికే నియోజకవర్గ సన్నాహక సమావేశాల్లో పాల్గొంటూ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నాయి.

**ఒకట్రెండు రోజుల్లో..**

వరంగల్ లోక్‌సభతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికలో బరిలోకి దిగే అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు పూర్తిచేసినట్టు తెలిసింది. క్షేత్రస్థాయి నుంచి అభిప్రాయాలు సేకరించిన గులాబీ దళపతి ఒకట్రెండు రోజుల్లో ఈ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారని సమాచారం. మిగతా స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక ఇప్పటికే పూర్తయింది.

**కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలపై ఫోకస్**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే అన్ని వర్గాలు ఎలా నిర్లక్ష్యానికి గురయ్యాయి? వ్యవసాయ, పారిశ్రామికరంగాలు ఎలా నిర్వీర్యమవుతున్నాయి? కాంగ్రెస్ 120 రోజుల పాలన, కేంద్రంలో బీజేపీ పదేండ్ల పాలన రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా ఎలా మారింది? వంటి అంశాలతో కేసీఆర్ ఎన్నిక ఎన్నికల రణక్షేత్రంలో దూకనున్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రశ్నార్థకం చేసిన రాష్ట్ర ప్రభుత్వంపై ఇటీవల నల్లగొండ, కరీంనగర్ సభల్లో కేసీఆర్ దుమ్మెత్తిపోశారు. దక్షిణ, ఉత్తర తెలంగాణలలో నీళ్లు లేక ఎండిన పంటపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అన్నదాతకు ధైర్యం చెప్పారు.

**కేసీఆర్ పొలంబాటే పోరుగీతం**

రాష్ట్రంలో మరే పార్టీకి లేని బలమైన పునాది తమకు ఉన్నదని, అదే తమకు కొండంత అండ అని గులాబీదళం ధీమా ఉన్నది. మిగతా పార్టీలకు అవకాశవాద క్యాడర్ ఉంటే తమకు మాత్రం అంకుశంలాంటి క్యాడర్ ఉన్నదని కేసీఆర్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ఇటీవల కేసీఆర్ నిర్వహించిన పొలంబాట కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో మరింత ఆత్మస్థైర్యాన్ని నింపాయి. స్వార్థం చూసుకునే కొందరు నేతలు పార్టీ విడిచి వెళ్లినా క్యాడర్ చెక్కుచెదరకుండా ఉన్నదని నల్లగొండ, కరీంనగర్ బహిరంగ సభలు, పొలంబాట కార్యక్రమాలు నిరూపించాయి. కేసీఆర్ నాలుగు నెలల్లో నాలుగు సార్లు ప్రజాక్షేత్రంలోకి వస్తేనే ప్రభుత్వం ఆగమాగం అవుతున్నదని, ఇక ఆయన నిత్యం ప్రజల్లో ఉంటే ఇక్కట్లు తప్పవని విశ్లేషకులు చెప్తున్నారు.

# ప్రతిపక్షం ప్రయత్నిస్తే దిగ్విజయ ఫలితాలు

- వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి
- వాహన, అగ్ని ప్రమాదాలు ఎక్కువ
- రైతులకు యోగ్యమైన సంవత్సరం
- తెలంగాణభవన్ ఉగాది వేడుకల్లో సిద్ధాంతి ప్రణీత్‌కుమార్ పంచాంగ శ్రవణం
- పాల్గొన్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో ఉగాది పచ్చడిని సేవిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో పోచారం, సబిత, పొన్నాల, యాదయ్య, ఆనంద్

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): క్రోధి నామ సంవత్సరంలో కుజుడు అధిపతిగా ఉండటం వల్ల వాహన, అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని, ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, నదులన్నీ బాగా ప్రవహిస్తాయని, తద్వారా పాడి పంటలు మంచిగా ఉంటాయని సిద్ధాంతి ప్రణీత్‌కుమార్ తెలిపారు. వరి, గోధుమ, కూరగాయల వ్యాపారులకు, వ్యవసాయదారులకు యోగ్యమైన సంవత్సరంగా ఉంటుందని చెప్పారు. ఆగస్టు వరకు సుముహూర్తాలు కనిపించడం లేదని తెలిపారు. రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో పాలకపక్షంగా ఉన్నవారికి కొంత కష్ట సాధ్యంగా ఉంటుందని, ప్రతిపక్షంగా ఉన్న వారు ప్రయత్నం చేస్తే దిగ్విజయ ఫలితాలు దక్కే అవకాశం కనిపిస్తున్నదని పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణభవన్‌లో శ్రీక్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హాజరయ్యారు. సిద్ధాంతి ప్రణీత్ కుమార్ ఉగాది పంచాగం చదివారు. ఈ సందర్భంగా క్రోధి నామ సంవత్సరాల విశేషాలను వివరిస్తూ.. సంవత్సరం మధ్యలో వచ్చే ఆహార కొరత వల్ల ఎగుమతి రంగం ఇబ్బందికరంగా ఉంటుందని పేర్కొన్నారు. ధరలు అధికమవుతాయని తెలిపారు.

**కేసీఆర్‌కు గురుబలం**

బీఆర్ఎస్ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావుది కర్కాటక రాశి అని, ఆదాయం 14, వ్యయం 2, రాజ్యపూజ్యం 6, అవమానం 6గా ఉంటుందని సిద్ధాంతి తెలిపారు. గురుడు మంచి స్థానంలో ఉన్నాడని, ఈ సంవత్సరం బాగున్నదని వివరించారు. వ్యవహారాల్లో మంచి విజయం చేకూరే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఏ ఎత్తుగడలు వేస్తారో వాటన్నింటికీ ప్రజాబలం లభిస్తుందని చెప్పారు. వ్యక్తిగతంగా మంచి పేరు, ప్రతిష్ఠలు ఉన్నాయని, ఆరోగ్యపరంగా మాత్రం జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎక్కువ ప్రయాణాలు చేయొద్దని, వాహన ప్రమాద సూచన ఉన్నదని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దోష నివారణకు లక్ష్మి, మోహన గణపతిని ఆరాధించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ది మకర రాశి అని, ఆదాయం 14, వ్యయం 14, రాజ్యపూజ్యం 3, అవమానం 1గా ఉన్నదని తెలిపారు. ఈ రాశి వారు ఏ పనిచేసినా బ్యాలెన్స్‌గా చేయాలని, మాటను కట్టడి చేసుకోవడం వల్ల, మృదువుగా మాట్లాడం వల్ల, చక్కటి ఉపకారాన్ని, అభిమానాన్ని పొందగలుగుతారని చెప్పారు. వ్యాపారం రంగంలో కూడా అభివృద్ధి చెందే వారు ఈ రాశివారని అన్నారు. సన్నిహితుల్లో కొంతమంది తమను దూరం పెట్టారని భ్రమించి దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కేటీఆర్ ఇటు ప్రజల్లో, అటు పార్టీలో అందరి అభిమానాన్ని పొందగలుగుతారని తెలిపారు. జాగ్రత్తగా ఉంటే ఎన్నికల్లో మంచి పట్టు సాధించే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. మకర రాశి వారు జ్యోతిర్లంగ దర్శనం చేసుకోవాలని, రుద్రయాగాలు చేయాలని సూచించారు.

**అందరికీ మంచి జరగాలి: కేటీఆర్**

రాష్ట్ర ప్రజలతోపాటు దేశ, విదేశాల్లో ఉన్న తెలుగు వారందరికీ కేటీఆర్ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. శాంతి సామరస్యాలతో ఎలాంటి మత కలహాలు జరగకుండా, సుఖ సంతోషాలతో, శాంతి సామరస్యంగా, ఆరోగ్యంగా ఉండాలని అభిలషించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, వ్యవసాయం బాగుండాలని, వాతావరణం అనుకూలంగా ఉండాలని మనస్ఫూర్తిగా భగవంతున్ని ప్రార్థిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కాలే యాదయ్య, సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గ్యాదరి బాలమల్లు, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, ఆనంద్, మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ మన్నె కవిత, బీఆర్ఎస్ నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, కే విప్లవ్‌కుమార్, రూప్‌సింగ్, వాసుదేవరెడ్డి, దూదిమెట్ల బాలరాజుయాదవ్, తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్‌ను అమలుచేయాలి

- నేటి నుంచే ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టాలి
- ఉద్యోగులకిచ్చిన అన్ని హామీలనూ నెరవేర్చాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, ఏప్రిల్ 9(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన ఇతర అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని, దీనికోసం బుధవారం నుంచే కార్యాచరణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. వంద రోజులు పూర్తయినా ఉద్యోగుల హెల్త్ పాలసీ హామీ అమలుపై ఎటువంటి పురోగతి లేదని విమర్శించారు. ఉద్యోగులు, జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు జారీచేసి కార్పొరేట్ వైద్యం అందేలా వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల జీపీఎఫ్, మెడికల్ బిల్లులు రావడం లేదని, హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌లు విడుదల చేయడం లేదని, వాటిని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరు మంత్రుల జిల్లాలోని ఉద్యోగులకే బిల్లులు చెల్లిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అందరికీ ఒకేసారి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పోలీసుల సరెండర్ లీవ్‌లు, ఎరియర్స్ వంటివి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగు వేతనాలను విడుదల చేయాలని కోరారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగుల సంక్షేమానికి ఎంతో కృషి చేశామని గుర్తు చేశారు.

**ఉద్యోగులతో అమర్యాదగా ప్రవర్తించొద్దు**

కొందరు కలెక్టర్లు, హెచ్‌వోడీలు కిందిస్థాయి ఉద్యోగులతో అమర్యాదగా, అవమానకరంగా మాట్లాడుతున్నారని, అధికారులు తమ పద్ధతి మార్చుకోకుంటే ఊరుకునేది లేదని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. జాబ్‌చార్ట్ ప్రకారం ఎవరి పని వారు చేయాలని, ఉద్యోగులను వేధిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ పేరుతో కొందరు ఉద్యోగులపై అకారణంగా చర్యలు తీసుకుంటున్నారని, బెదిరింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. విధులనుంచి తొలగించిన 250 మంది హోంగార్డులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వారితోపాటు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే పర్మినెంటు చేయాలని కోరారు. చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని, స్పౌజ్ కేసులను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

# కాంగ్రెస్, బీజేపీవి కుమ్మక్కు రాజకీయాలు

- మైనార్టీలు ఆలోచించాలి: వేముల
- మతం పేరిట బీజేపీ ఓట్లు: బాజిరెడ్డి



ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులకు పండ్లు తినిపిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

భీమ్‌గల్, ఏప్రిల్ 9: కాంగ్రెస్, బీజేపీ పార్టీలవి కుమ్మక్కు రాజకీయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లోని మదర్సా నూర్‌మసీదులో మంగళవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. తెలంగాణ పెద్దదిక్కు కేసీఆర్‌ను ఓడించడమే కాంగ్రెస్, బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీని విమర్శిస్తుంటే.. రాష్ట్రంలో ఆ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి మోదీని బడేభాయ్ అంటున్నారని, దీన్నిబట్టి ఆ రెండు పార్టీలవి కుమ్మక్కు రాజకీయాలని అర్థమవుతున్నదని చెప్పారు. ఇప్పటికైనా మైనార్టీ సోదరులు ఆలోచించాలని, ఎంపీ ఎన్నికల్లో మీరు మళ్లీ ఓటు వేస్తే మహారాష్ట్రలో మాదిరిగా ఇక్కడ రేవంత్‌రెడ్డి ఏక్‌నాథ్ షిండే అవ్వడం ఖాయమని హెచ్చరించారు. నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మతం పేరిట ఓట్లు అడుగుతున్నదని మండిపడ్డారు. 5 రోజుల్లో పసుపు బోర్డు తెస్తానన్న అర్వింద్.. ఐదేండ్లు గడిచినా బోర్డుకు అతీగతీ లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఉన్న జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఏనాడూ ప్రజల మంచి చెడులో పాల్గొనలేదని తెలిపారు. అనంతరం సర్వసమాజ్ కమిటీ పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే వేముల, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడి

మొదటిపేజీ తరువాయి...

ఊరేగింపు జరుగుతున్నది. ఆ సమయంలో బీఆర్ఎస్ కొమ్మినేపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు చల్లా హరి తన కుమారుడు జానీతోపాటు సోదరుడి కుమార్తె బ్యూలాను బైక్‌పై ఎక్కించుకొని ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓ మంత్రి అనుచరుడిగా చెప్పుకునే మేకపోతుల మహేశ్ గౌడ్ సహా మరికొంతమంది కలిసి చల్లా హరిపై దాడికి పాల్పడ్డారు. వారిని అడ్డుకున్న పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలకు కూడా తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కామేపల్లి మండల అధ్యక్షుడు దనియాకుల హన్మంతరావు.. తన కారులో కొమ్మినేపల్లిలోని చల్లా హరి ఇంటికి వెళ్లగా.. కాంగ్రెస్ గూండాలు హన్మంతరావు కారు అద్దాలను ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా బీఆర్ఎస్ కార్యకర్తల ఇండ్లపైనా దాడి చేసి పలువురిని గాయపర్చారు. సమాచారం అందుకున్న ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గ్రామంలో 144 సెక్షన్ విధించినట్టు ఏసీపీ తెలిపారు.




కాంగ్రెస్ నేతల దాడిలో గాయపడిన చల్లా హరి కుమారుడు జానీ

# తినే ఆహారంలో పోషకాలు లెక్కించొచ్చు!

**కౌంట్ వాట్ యూ ఈట్ పేరిట వెబ్‌సైట్ ఆధారిత సేవలు • అభివృద్ధి చేసిన ఎన్ఐఎన్**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): అతి సర్వత్రా వర్జయేత్.. అంటారు. అతిగా తినడం అయినా, అతిగా ఉపవాసం ఉండటమైనా మన శరీరానికి కీడే చేస్తాయి. మనం ఎంత తినాలి? ఏది తినాలి? తినే ఆహారంలో పోషకాలు ఎన్ని ఉన్నాయి? ఆహారంలో పోషకాలను లెక్కించే విధానం కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. పోషకాహార ప్రాధాన్యం, తీసుకొనే ఆహారంలో ఉండే పోషక విలువలు, బాడీమాస్ ఇండెక్స్, అధిక పోషకాలు కలిగిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా 'కౌంట్ వాట్ యూ ఈట్' పేరిట ప్రత్యేక వెబ్‌సైట్‌ను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) నిపుణులు అభివృద్ధి చేశారు. గాడితప్పిన జీవనశైలి, పోషకరహిత ఆహారాలతోనే హైబీపీ, డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధులతోపాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు పెరుగుతున్నాయని ఇప్పటికే పలు అధ్యయనాల్లో వెల్లడైంది. పోషకాహార లోపాన్ని నియంత్రించేలా, ఆధునిక జీవనశైలికి అనుకూలమైన ఆహార పదార్థాలు, పోషకాలపై అవగాహన కల్పించేలా కౌంట్ వాట్ యూ ఈట్ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేశారు. అంతర్జాతీయ పోషకాహార ప్రమాణాలు, క్యాలరీ, బీఎంఐ, బీఎంఆర్, న్యూట్రిషన్ రిచ్ ఫుడ్, హెల్త్ కాలిక్యులేటర్ వంటి సేవలను పొందుపరిచి అందుబాటులోకి తీసుకొచ్చారు.



**పోషకాల కాలిక్యులేటర్**

కౌంట్ వాట్ యూ ఈట్‌లో ఒకసారి నమోదు చేసుకోగానే.. పోషకాలను లెక్కించుకొనే వీలు ఉంటుంది. బీఎంఐ, క్యాలరీ కాలిక్యులేటర్, వయస్సు, శారీరక పనితీరును బట్టిని అవసరమైన పోషకాలను లెక్కించడంతోపాటు ఎంత పరిమాణంలో సూక్ష్మ పోషకాలను తీసుకోవాలనే విషయాన్ని గణాంకాలతో సహా చూపుతుంది. వ్యాయామం చేసే పురుషుడికి కావాల్సిన పోషకాలను లెక్కించడానికి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. రోజువారీ క్యాలరీలు, ప్రోటీన్, ఫ్యాట్, క్యాల్షియం, ఐరన్, రెటినాల్, బీటా-కెరాటిన్, థయామిన్, రైబోఫ్లేవీన్, నికోటినిక్ యాసిడ్, విటమిన్ బీ6, విటమిన్ సీ, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12, జింక్, మెగ్నీషియం, నియాసిన్, ఫోలెట్ వంటి వివరాలతో కూడిన పట్టికను చూపుతుంది. రోజువారీగా పోషకాహారాన్ని తీసుకోవడం సులభంగా అర్థం చేసుకొనేలా వెబ్‌సైట్‌ను రూపొందించారు. బీఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్), బీఎంఆర్ (బాసల్ మెటాబాలిక్ రేట్), ఐడియల్ వెయిట్, క్యాలరీ క్యాలికేటర్లనూ పొందుపరిచారు. ఒకసారి నమోదు చేసుకున్న తర్వాత అన్ని సేవలను పొందవచ్చని ఎన్ఐఎన్ వర్గాలు పేర్కొన్నాయి.

## లోకం పోకడ




ఇక్కడ నీళ్లు పారవు, నీళ్ల పేరుతో రాజకీయాలు పారుతాయి!

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 40.6°c | 21.1°c |
| ఆదిలాబాద్ | 39.9°c | 22.6°c |
| ఖమ్మం | 39.0°c | 24.0°c |
| నల్లగొండ | 38.7°c | 24.0°c |
| మహబూబ్‌నగర్ | 38.4°c | 27.3°c |
| నిజామాబాద్ | 38.4°c | 25.8°c |
| మెదక్ | 37.9°c | 22.9°c |
| వరంగల్ | 37.0°c | 25.0°c |
| కరీంనగర్ | 36.0°c | 26.0°c |
| హైదరాబాద్ | 36.0°c | 24.0°c |

# మరో నాలుగు రోజులు వర్షాలు

**ఎండ నుంచి కాస్త ఉపశమనం**

**హైదరాబాద్ వాతావరణ శాఖ**

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వచ్చే నాలుగు రోజులు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీచేశారు. అదే సమయంలో పలు జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నదని తెలిపారు. ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతోపాటు వడగాడ్పులు వీస్తాయని పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాలతోపాటు కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో శుక్రవారం వరకు అక్కడక్కడ ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపారు.

**సాయంత్రం చల్లని గాలులు**

దాదాపు రెండు వారాల తర్వాత తెలంగాణలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గత రెండు వారాలుగా 44 డిగ్రీల వరకు నమోదైన ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు పడిపోయాయి. హైదరాబాద్‌లో 40 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం చల్లని గాలులు వీయటంతో నగరవాసులు ఉపశమనం పొందుతున్నారు. రాబోయే మూడు, నాలుగు రోజులు హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అధికారులు తెలిపారు.

# 2 వేల కోట్ల భూముల కేసులో ప్రభుత్వానికి నోటీసులు

**నిషేధిత భూముల వివాదంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలంలో దాదాపు రూ.2 వేల కోట్ల విలువైన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రిజిస్ట్రార్ తదితరులను ఆదేశించింది. సరూర్‌నగర్ మండలం బహదూర్‌గూడ సర్వే నంబర్ 49/13బీలోని 14.31 ఎకరాలు, సరూర్‌నగర్ మండలం సర్వే నంబర్ 9/4లోని 21.09 ఎకరాలు కలిపి మొత్తం 36 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ భూములను సౌత్ ఇండియా రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించారు. ఆ తర్వాత దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేయడంతో నిషేధిత జాబితాలో చేర్చారు. 2021, మార్చి 13న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం ఆ భూములను సౌత్ ఇండియా రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తోపాటు జీఆర్ ఇంట్రాకెమ్ లిమిటెడ్, శ్రీ ఇందిరా డిస్టిల్లర్, సిరి సెల్లర్స్, సుదర్శన్ ల్యాబొరేటరీస్‌కు ఇవ్వడంతో వారు ఎస్ఆర్ ఇన్‌ఫ్రా అండ్ డెవలపర్స్, వాసవీ గ్రూప్‌లకు రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో అక్కడ నిబంధనలకు విరుద్ధంగా హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని, నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించే అధికారం కలెక్టర్‌కు లేదని ఎల్బీనగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త అశోక్ కుమార్ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చేలా అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిల్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. వాదనలు విన్న అనంతరం ప్రతివాదులకు నోటీసులు జారీచేసి, విచారణను వాయిదా వేసింది.